క్లుప్తంగా

ఘనంగా సప్తాహ పారాయణం



సప్తహ పారాయణం చేస్తున్న భక్తులు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో గత ఆరు రోజులుగా సప్తాహ పారాయణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు భాగవతం విన్నా.. చదివిన మోక్షం కలుగుతుందని తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు.

నాసిరకంగా రోడ్డు నిర్మాణం



రోడ్డు మధ్యలో ఊడిపోతున్న తారువేసిన రోడ్డు భాగం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లక్కగూడ పంచాయతీ, సదునుగూడ బీటీ రోడ్డు నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు వేసిన రెండు నెలల్లోనే ఊడిపోతోందని పలువురు వాపోతున్నారు. రూ.75 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో లక్కగూడ నుంచి సదునుగూడ వరకు 1.4 కిలోమీటర్ల మేర వేసిన రోడ్డు ప్రస్తుతం పెచ్చులూడిపోతోందని, కనీసం ఐదేళ్లు కూడా వేసిన రోడ్డు లేకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వల్లే ఇలా జరిగిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సందేహాలుంటే ఫిర్యాదు చేయండి

వీరఘట్టం: భూముల రీ సర్వేలో ఏమైనా సందేహాలు ఉంటే రైతులు ఫిర్యాదు చేయవచ్చునని తహసీల్దార్ కామేశ్వరరావు సూచించారు. మంగళవారం తూడి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో రైతులతో మాట్లాడారు. చిన్న చిన్న సమస్యలు ఉన్నా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సర్వే డీటీ జి.ప్రసాదరావు, వీఆర్వోలు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు వేగవంతం చేయాలి



సీతానగరం: ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ అడ్మిషన్స్ వేగవంతం చేయాలని అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్(డిప్యూటీ కమిషనర్) ఎం.సుధాకర రావు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎమ్ ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఓపెన్‌స్కూల్ సమాచారంతో కూడిన వాల్‌పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ కార్యాలయం సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల సాగుపై ముందుగా అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏఓ ఎస్ అవినాష్

సీతానగరం: ఖరీఫ్ పంటలు సాగు చేస్తున్న రైతులు వివిధ పద్ధతుల ద్వారా సాగుపై అవగాహన కల్పించుకుని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడానికి కృషి చేయాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పెదంకలాం గ్రామంలో వరి వెద మడులలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా సర్పంచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలి

- సీపీఎం నాయకుడు పి.రాము

పార్వతీపురం రూరల్: మండలంలోని గంగాపురం పంచాయతీ తాన్నవలస గ్రామంలో గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని అనేక మార్లు విన్నవించుకున్నప్పటికీ అధికారులు స్పందన కరువైంది. కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా సంబంధిత రెవెన్యూ అధికారులు సర్వేలు నిర్వహించి ఏడాది గడుస్తున్నా నేటికి పట్టాలు మంజూరు చేయలేదని సీపీఎం మండల నాయకుడు పి.రాము అన్నారు. ఈ మేరకు మంగళవారం తాన్నవలస గ్రామస్తులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ప్రజా క్షేత్రంలో బాబు మోసాలను ఎండగడదాం..

- అధికారం కోసం ప్రజలను కూటమి నేతలు మోసగించారు
- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి

పాలకొండ రూరల్:

అధికారం కోసం కూటమి కట్టి అమలు కాని హామీలతో ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసాలను ప్రజా క్షేత్రంలో ఎండగడదామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని చినమంగళాపురం గ్రామంలో సర్పంచ్ గోగుల కల్యాణ్ అధ్యక్షతన బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీకి సంబంధించి మండల విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం జెరాక్స్ పాలన చేపడుతుందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారంజికంగా అమలు చేసిన సంక్షేమ పథకాలకే పేర్లు మార్చి నెట్టుకొస్తున్నారన్నారు. ఏ గడప తొక్కినా సూపర్ సిక్స్ హామీలు నెరవేర లేదంటూ అర్హులు ఏవగించుకుంటున్నారన్నారు. సూపర్ సిక్స్ అమలు విషయంలో తనది హామీ అన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేడు ప్రశ్నించే తత్వానికి స్వస్తి చెప్పి బాబు ఆడమన్నట్టుగా ఆడుతున్నారన్నారు. సంపద సృష్టి పేరుతో సంక్షేమ పథకాలకు తూట్లు పొడుస్తూ కూటమి సర్కారు ప్రజలను మోసం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ, మండల స్థాయి విభాగాల అధ్యక్షులు సర్పంచ్ గోగుల కల్యాణి, మన్యం జిల్లా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బంకి లక్షణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు కనపాక సూర్యప్రకాష్, నల్లి శివప్రసాద్, పాంద్రంకి హైమావతి, నల్లబారిక గాంధీ, దుప్పాడ కళావతి, అల్లు సురేష్ కుమార్, కరణం బాబ్జీరావు, గార బలరాంనాయుడుతో పాటు మండల పరిధిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, చినమంగళాపురం ప్రజల పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అంతకు ముందు దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహానికి, సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం చిత్రపటానికి మండల పార్టీ అధ్యక్షుడు కనపాక సూర్యప్రకాష్ నేతృత్వంలో పూలమాలలు వేసి అంజలి ఘటించారు.



చినమంగళాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

ప్రజలను ఓడిపోనీయం..



అబద్ధపు హామీలతో అధికారం చేపట్టి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సర్కారును కూటమి కుయుక్తులతో ఓడించిన ప్రజలను మాత్రం ప్రజా క్షేత్రంలో ఓడిపోనీయం. అబద్ధాలకు బ్రాండ్‌గా గుర్తింపు పొందిన బాబు, ఆయనకు వత్తాసు పలుకుతున్న జనసేన, బీజేపీ నేడు సంక్షేమ అమలు విషయంలో విఫలమైంది. పాలకొండ నియోజకవర్గ స్థాయిలో పాలన చూసుకుంటే గాడి తప్పింది. కూటమిలో కుమ్ములాటలు, ప్రజలపాలిట శాపంగా మారాయి. సూపర్‌సిక్స్ గాలికి వదిలేసి ప్రజలపై భారం మోపుతున్నారు. ప్రస్తుతం నాటి జగనన్న పాలనను గుర్తు చేసుకొని ప్రజలు ప్రస్తుత ప్రభుత్వాన్ని బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఈ తీరును మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత పార్టీ కేడర్ అందరిపై ఉంది. బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలోకి తీసుకువెళ్లి కూటమి వైఫల్యాలను ఎండగట్టాలి. ప్రజల పక్షాన గొంతుకై నిలబడదాం.

– విశ్వాసరాయి కళావతి, మాజీ శాసనసభ్యురాలు



హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

1800 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం



బెల్లం ఊటలను పారబోసి స్వాధీనం చేసుకున్న డ్రమ్ములు

వీరఘట్టం: మండలంలోని హుస్సేనుపురం గ్రామ శివారులో 1800 లీటర్ల బెల్లం ఊటలను మంగళవారం ధ్వంసం చేసినట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు. ఇక్కడ సారా తయారు చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో తమ సిబ్బందితో దాడులు చేయగా తయారీ దారులు పరారయ్యారన్నారు. పరారైన వారి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బెల్లం ఊటలను పారబోసి సారా తయారీకి ఉపయోగించిన ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నామన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



గిరిజనులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారి

భామిని: మండలంలోని కోసిమానుగూడ, జియ్యమానుగూడ, బిచ్చమానుగూడలలో బత్తిలి వైద్యాధికారి కొత్తపల్లి రవీంద్ర ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దోమతెరల వాడకంతో దోమల నివారణపై వివరించారు. వైద్య శిబిరాల్లో 76 మందిని పరీక్షించి తొమ్మిది మంది జ్వరాలతో బాధపడుతున్నట్టు గుర్తించారు. ఈవో నూకన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చేసింది తక్కువ..చెప్పుకునేది ఎక్కువ..



గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసింది తక్కువ..గొప్పలు చెప్పుకునేది ఎక్కువని కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు విమర్శించారు. ఇదే విషయమై ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రైస్‌కార్డులు, పింఛన్లు తదితర వాటిని ఇచ్చేందుకు కాలాయాపన చేస్తోందని, తద్వారా అర్హులు కూటమి ప్రభుత్వం అందించే అరకొర సంక్షేమ పథకాలు కూడా అందుకోలేకపోతున్నారని మండిపడ్డారు. ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిగా అమలు చేయకుండానే సుపరిపాలన అందించామని గడపగడపకూ కూటమి నాయకులు వెళ్లి గొప్పలు చెప్పుకోవడం దారుణమన్నారు. వారి కార్యక్రమం చూసి జనం నవ్వుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజలకు మంచి చేయడంపై దృష్టిసారించాలని హితవు పలికారు.

పరామర్శ



ఎంపీటీసీని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: చిన్నబగ్గ ఎంపీటీసీ ఎస్.మంగయ్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం పరామర్శించారు. గత కొద్ది రోజులుగా మలేరియా, టైఫాయిడ్ జ్వరంతో మంచం పట్టడంతో మందులు జాగ్రత్తగా వాడి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ, నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ నిమ్మక కాంతారావు, ఎంపీటీసీలు ఎస్.చంద్రశేఖరరావు, బి.లక్ష్మి, పార్టీ నాయకులు వెంకీ తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలి

వీరఘట్టం: అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలకు జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు వీలుగా టాప్‌లో ఉన్న 10 శాతం కుటుంబాలు దత్తత తీసుకోవడం పీ-4 సర్వే ఉద్దేశమని ఎంపీడీవో బి.వెంకటరమణ అన్నారు. మండలంలోని చలివేంద్రి గ్రామంలో మంగళవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో పీ - 4 సర్వే చేపట్టాలని సూచించారు. అలాగే తలవరం, పనసనందివాడ గ్రామాల్లో కూడా పీ-4 గ్రామ సభలు నిర్వహించారు.

శాకంబరిగా దర్శనమిచ్చిన శ్యామలాంబ

సాలూరు: పట్టణంలోని శ్యామలాంబ అమ్మవారు శాకంబరి దేవిగా భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. అమ్మవారిని శాకంబరిగా ప్రత్యేకంగా అలంకరించడంతో అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా తిరుపతి

భామిని: మండలంలోని సొలికిరికి చెందిన కొత్తకోట తిరుపతిరావు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. తిరుపతిరావు గతంలో పార్టీ జిల్లా కార్యదర్శిగా ఉన్నారు.

15 లీటర్ల సారా స్వాధీనం

కొమరాడ: మండలంలోని జంఝావతి జంక్షన్ సమీపంలో గుమడ గ్రామంలో 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.నీలకంఠం మంగళవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి అదే గ్రామానికి చెందిన దేవుపల్లి రాజు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచామన్నారు.

పీ4 సర్వేపై గ్రామసభ

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని గడసింగుపురంలో పీ4 సర్వేపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. సభలో మార్గదర్శి-బంగారు కుటుంబం పథకానికి అర్హులైన వారి పేర్లు వెల్లడించి, వారి అర్హతలపై చర్చించారు. నిజమైన నిరుపేదలను మాత్రమే మార్గదర్శికి దత్తత ఇచ్చి వారి(దాతలు) సాయం ద్వారా వారిని బంగారు కుటుంబాలుగా మలచడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఎంపీడీవో కె.ధర్మారావు తెలిపారు.

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామ సచివాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించి, పీ4 సర్వేపై సమీక్షించారు. ఎంపీడీవో జి.పైడితల్లి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు మార్గదర్శుల అనుసంధానం ద్వారా వారిని బంగారు కుటుంబాలుగా మలచడమే పీ4 సర్వే, మార్గదర్శి-బంగారు కుటుంబం పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. మార్గదర్శులకు అనుసంధానించిన కుటుంబాలకు విద్య, వైద్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. సమావేశంలో సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో ధర్మారావు

వాహనచోదకులు నిబంధనలు పాటించాలి



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ

పాలకొండ: వాహనచోదకులు నిబంధనలు పాటించాలని ఎస్ఐ ప్రయోగమూర్తి అన్నారు. పాలకొండ-వీరఘట్టం రహదారిలో వాహన తనిఖీలు మంగళవారం నిర్వహించారు. యువత లైసెన్స్‌లు పొందకుండా వాహనాలు నడుపుతున్నట్టు గుర్తించి వారికి అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు వాహనానికి సంబంధించి అన్ని ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. మైనర్లకు వాహనాలు అందిస్తే సంబంధిత వాహన దారులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు.

వ్యవసాయ యంత్రాల పంపిణీ



రైతులకు వ్యవసాయ యంత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద పీవీటీజీ రైతులకు మంజూరైన వ్యవసాయ యంత్రాలు(వరినాట్లు వేసే యంత్రం) ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చేతులమీదుగా మంగళవారం పంపిణీ చేశారు. వంద శాతం రాయితీపై ఇచ్చే ఈ యంత్ర పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రైతులను కోరారు. అనంతరం ఏడీఏ అన్నపూర్ణ, పీఏవో శ్రీనివాసరావు, గుమ్మలక్ష్మీపురం వ్యవసాయాధికారి పి.శంకరరావులతో కలిసి పచ్చిరొట్ట విత్తనాల ప్రాధాన్యం తెలిపే పోస్టరును ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

వర్మీకంపోస్టు తయారు చేయండి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం):

ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు)ల్లో వర్మీకంపోస్టు తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు సూచించారు. కురుపాం మండలంలోని బియ్యాలవలస గ్రామంలో మంగళవారం పర్యటించిన ఆయన..అక్కడి ఎస్‌డబ్ల్యూపీసీని సందర్శించి, వర్మీకంపోస్టు తయారీపై పలు సూచనలు చేశారు. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తాచెదారాన్ని కేంద్రానికి తరలించి, దాని ద్వారా వర్మీకంపోస్టు(ఎరువు) తయారు చేసి, సబ్సిడీపై రైతులకు అందజేయాలని తెలిపారు. ఇలా చేస్తే పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వై.వెంకటనాయుడు తదితరులు ఉన్నారు.



వర్మీకంపోస్టును పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం శ్రావణ్‌కుమార్‌నాయుడు

గుమ్మలక్ష్మీపురం: రైతులంతా ప్రకృతి సేద్యం అవలంబించేలా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రబంధకులు(డీపీఎం) ఎం.శ్రావణ్‌కుమార్‌నాయుడు అన్నారు. మండలంలోని దుడ్డుఖల్లు గ్రామంలో రాయగడ జమ్ము, గొయిపాక, చాపరాయి బిన్నిడి ప్రకృతి వ్యవసాయం యూనిట్లకు చెందిన కార్యకర్తలతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులంతా ప్రకృతి సేద్యమే కాకుండా ఏటీఎం, ఏ-గ్రేడ్, ఏ-గ్రేడ్ ప్లస్, డీఆర్‌పీఎం పద్ధతులు పాటిస్తూ కూరగాయలు, ఆకుకూరలు, వివిధ పండ్లు పండించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రెడ్డి అన్నపూర్ణ, జట్టు కో-ఆర్డినేటర్ ఎం.నూకంనాయుడు, ఏటీఎం మోడల్ మండల లీడర్ గణేష్‌శరత్ చంద్ర, జీవ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జి.ప్రబోధ్ తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి: వర్షాకాలంలో పశువులు వ్యాధుల బారి పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక వైద్యాధికారిణి అలజంగి స్రవంతి సూచించారు. ఇదే విషయమై ఆమె మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. వానాకాలంలో క్రిమికీటకాలు, సూక్ష్మజీవుల వల్ల పశువులకు గాలికుంటు, గొంతువాపు, జబ్బవాపు తదితర వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. వర్షాలు ప్రారంభమైన వెంటనే ముందుగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. ఆవులు, గేదెలు వాటి పాల ద్వారా వాటి దూడలకు గాలికుంటు వ్యాధి వ్యాప్తిస్తుందన్నారు. నోరు, చిగుళ్లపై పొక్కులు ఏర్పడి మేత, నీరు సరిగా తీసుకోక నీరసించిపోతాయని నోటి నుంచి సొంగ కారడం వంటి లక్షణం కూడా కనిపిస్తుందన్నారు.

గొంతువాపు వ్యాధి గేదె జాతి పశువుల్లో ఎక్కువగా కనిపిస్తుందన్నారు. కలుషిత ఆహారం, నీటి ఆవుల్లో జబ్బవాపు వ్యాధి వ్యాపిస్తుందని, జబ్బ, తొడ కండరాలపై వాపు ఈ వ్యాధి లక్షణాలు అని తెలిపారు. ఏ మూగజీవిలోనైనా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశువైద్య కేంద్రానికి తరలించాలని తెలిపారు.

ఇది ప్రజా వ్యతిరేక ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే కళావతి



పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

భామిని: వ్యవసాయం దండగా అనే టీడీపీ కూటమి ప్రభుత్వం రైతులను తీవ్రంగా దగా చేస్తున్నదని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం తీవ్రంగా విమర్శించారు. మండలం బాలేరులో మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతులపై కక్ష సాధింపుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతు భరోసా కేంద్రాలను రైతులకు దూరం చేసిందని, పేరు మార్చిన అన్నధాత సుఖీభవ ఇస్తామని మోసం చేసిందన్నారు. ఆర్‌బీకేల ద్వారా ఎరువులు పంపిణీ చేయకుండా, ప్రైవేటు డీలర్లకు ఇచ్చి రైతులను దోచుకోమని చెప్పిందని ఆరోపించారు. యూరియా కోసం రైతులు ప్రైవేటు డీలర్ల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. ఆమె వెంట మండల పార్టీ ఉపాధ్యక్షులు కొత్తకోట చంద్రశేఖర్, యువజన అధ్యక్షులు గెల్లంకి రమేష్, రైతు విభాగం అధ్యక్షులు కాగితాపల్లి కృష్ణారావు, పార్టీ నాయకులు మేడిబోయిన చలపతిరావు, సీతంపేట ఎంపీపీ బిడ్డికి ఆదినారాయణలతో కలిసి మాట్లాడారు.